క్లుప్తంగా

జాహ్నవి టౌన్‌షిప్ కమిటీ ఎన్నిక

సూర్యాపేట : పట్టణంలోని జాహ్నవి టౌన్‌షిప్ యాజమాన్య – అభివృద్ధి సంక్షేమ కమిటీని ఆదివారం ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా పాటి సుధీర్, ఉపాధ్యక్షుడిగా ఓలేటి రాధాకృష్ణ, కార్యదర్శిగా కాటూరి పురుషోత్తం సిన్హా, సహాయ కార్యదర్శిగా పోతరాజు మల్లికార్జున్, కోశాధికారిగా పానుగోటి నరసింహారావు, సభ్యులుగా తన్నీరు శ్రీనివాసు, పి.వీరాంజనేయులు, ఉప్పలంచు వెంకన్న, పల్లపు బాలయ్య, జె.జగదీష్, సల్వాది రవికుమార్, చల్లా విజయ్ కుమార్‌లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో తిరునగరి గోపి పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

మద్దిరాల : కుషాయిగూడలో అగ్నిప్రమాదంలో భార్య, చిన్న కుమారుడితో సహా నరేష్ మృతి చెందిన విషయం తెలిసిందే. అయితే నరేష్ బాల్య మిత్రులు ఆదివారం రెడ్డిగూడెంలో మృతుల చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబానికి రూ.61వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు దగ్గల రవి, సుధాకర్, మడిపెద్ది మహేష్, అజయ్ పాల్గొన్నారు.

మాచిరెడ్డిపల్లి బీఆర్‌ఎస్ అధ్యక్షుడిగా వీరన్న

నాగారం : మాచిరెడ్డిపల్లి బీఆర్‌ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడిగా మట్టగజం వీరన్న, ఉపాధ్యక్షుడిగా నాతి మహేష్ ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికైనవారికి బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కల్లెట్లపల్లి ఉప్పలయ్య నియామకపత్రాలు అందజేశారు. అనంతరం గ్రామ శాఖ అధ్యక్షుడు మట్టగజం వీరన్న మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన బీఆర్‌ఎస్ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యారాల రాంరెడ్డి, గుండగాని అంబయ్యగౌడ్, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్‌కు మల్టిపుల్ కౌన్సిల్ మైల్‌స్టోన్ అవార్డు

తిరుమలగిరి : తిరుమలగిరి లయన్స్ క్లబ్‌కు ఇంటర్నేషనల్ మల్టిపుల్ కౌన్సిల్ మైల్ స్టోన్ అవార్డు లభించిందని ఆ సంఘం అధ్యక్షుడు జలగం రామచంద్రంగౌడ్ ఆదివారం తెలిపారు. హైదరాబాద్‌లో శంషాబాద్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో ఈ అవార్డును అందుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి ఐతె శ్రీనివాస్, కోశాధికారి సురేష్‌కుమార్, కృష్ణమాచారి, గణేష్, లక్ష్మణ్, పద్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చెస్ పోటీలు మేధా శక్తిని పెంచుతాయి


బహుమతులు అందజేస్తున్న డీఎస్పీ

సూర్యాపేట : చెస్ పోటీలు విద్యార్థుల్లో మేధా శక్తిని పెంచుతాయని డీఎస్పీ నాగభూషణం అన్నారు. ఆదివారం చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం, వరంగల్ జిల్లాల స్థాయి చెస్ ఛాంపియన్‌షిప్ 2023 అండర్ 15 పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు గండూరి కృపాకర్ తదితరులు పాల్గొన్నారు.

అంజయ్యను హత్యచేసిన వ్యక్తులను అరెస్టు చేయాలి

మద్దిరాల : తుంగతుర్తి మండల కేంద్రానికి చెందిన రైతు వెలుగు అంజయ్యను హత్య చేసిన వ్యక్తులను గుర్తించి వెంటనే అరెస్టు చేయాలని ముదిరాజ్ సంఘం జిల్లా నాయకుడు ఏటకారి మహేష్ డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతు అంజయ్య వ్యవసాయ భూమిపై కొంత మంది బడా నాయకుల కన్ను పడిందని, దానిని పలుమార్లు కబ్జా చేయడానికి ప్రయత్నించగా అంజయ్య అడ్డుకోవడంతో ఆయనను చంపి ఆత్మహత్యగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. పోలీసులు వెంటనే వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు నాగేష్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

పేద కుటుంబానికి చేయూత

చిలుకూరు : చిలుకూరు గ్రామానికి చెందిన వల్లపుదాసు రామారావు ఈ నెల 13వ తేదీన తాటి చెట్టు ఎక్కి కల్లు గీస్తుండగా ప్రమాదవశాత్తు చెట్టుపై నుంచి కింద పడి మృతి చెందారు. పేదరికంలో ఉన్న రామారావు కుటుంబాన్ని ఆదుకోవాలని సంకల్పించిన గ్రామస్తులు ఐక్యంగా వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసి బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. దీంతో చిలుకూరు గ్రామంతో పాటు హైదరాబాద్, ఆంధ్రా ప్రాంతానికి చెందిన పలువురు, ఇక్కడి ప్రాంతం వారి పరిచయాలతో అమెరికాలో ఉన్న పలువురు, ప్రభుత్వ ఉపాధ్యాయులు, ఉద్యోగులు అందరూ కలిసి రామారావు కుటుంబానికి ఫోన్ పే ద్వారా తమకు చేతనైన సహాయం చేశారు. దీంతో వచ్చిన రూ. 4 లక్షలను ఆదివారం జరిగిన రామారావు దశదిన కార్యక్రమంలో వారి కుటుంబసభ్యులకు దాతలు అందజేశారు. ఈ సందర్భంగా రామారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అకాల వర్షం.. రైతులకు శోకం

సూర్యాపేట, తుంగతుర్తి నియోజకవర్గాల్లోని పలు గ్రామాల్లో రెండు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలు రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. శనివారం రాత్రి, ఆదివారం పలు గ్రామాల్లో ఈదురుగాలులు, వడగండ్ల వర్షం కురిసింది. పంటలు దెబ్బతిన్నాయి. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసింది. పలువురి ఇళ్లు కూలాయి, ఇళ్ల పైకప్పులు లేచిపోయాయి. – సాక్షి నెట్‌వర్క్


ఆత్మకూరు : గట్టికల్లులో వర్షపు నీటిలో ధాన్యం రాశులు


అర్వపల్లిలోని సెర్ప్ కేంద్రంలో వర్షానికి కొట్టుకుపోయిన ధాన్యం


చివ్వెంల : బి.చందుపట్లలో కొట్టుకుపోతున్న ధాన్యాన్ని తీసుకుంటున్న రైతులు


చివ్వెంలలో రహదారిపై కొట్టుకుపోతున్న ధాన్యాన్ని దగ్గరకు తీస్తున్న మహిళ


చివ్వెంల : ఎర్రసూర్యతండా వద్ద తడిసిన ధాన్యం బస్తాలు


సూర్యాపేట రూరల్ : కూలిపోయిన ఇల్లు


ఆత్మకూరులో కురిసిన వడగండ్లు


నాగారం : వర్ధమానుకోటలో ఈదురుగాలులకు లేచిపోయిన ఇంటిపైకప్పు

దెబ్బతిన్న పంటల పరిశీలన

నాగారం : మండల పరిధిలోని వర్ధమానుకోట, నర్సింహులగూడెం, పేరబోయినగూడెం, ఫణిగిరి, డి.కొత్తపల్లి గ్రామాల్లో గత రెండు రోజులుగా ఈదురు గాలులుతో కూడిన వర్షాలకు దెబ్బతిన్న వరి పంటలను ఆదివారం వ్యవసాయశాఖ అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయశాఖ అధికారి పెండోట గణేష్ మాట్లాడారు. అకాల వర్షాలకు మండలంలో 2,310 ఎకరాల్లో వరిపంట, 102 ఎకరాల్లో మామిడితోటలు, 20 ఎకరాల్లో నిమ్మతోటలకు నష్టం వాటిల్లినట్లు ప్రాథమికంగా అంచనా వేసినట్లు తెలిపారు. ఈదురు గాలులకు నష్టపోయిన పంటల వివరాల నివేదికను ప్రభుత్వానికి అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓలు రమ్యతేజ, వసిమా, సాయి రాజ్, రైతులు పాషం యాదవరెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

తుంగతుర్తి : అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేసి, రైతులకు మద్దతు ధర చెల్లించాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లేపాక సాయిబాబా అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో దెబ్బతిన్న వరి పంటలను పరిశీలించి మాట్లాడారు. పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఆయనతోపాటు బీజేపీ మండల అధ్యక్షుడు గాజుల మహేందర్, లింగయ్య ఉన్నారు.

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండలంలో వడగళ్లతో రైతులు తీవ్రంగా నష్టపోగా ఎంపీపీ మన్నె రేణుకలక్ష్మీనర్సయ్యయాదవ్, కబడ్డీ అసోసియేషన్ జిల్లా చైర్మన్ మారిపెద్ది శ్రీనివాస్‌గౌడ్, రైతుబంధు సమితి మండల కోఆర్డినేటర్ పందిరి ఎర్రనర్సయ్య, తహసీల్దార్ యాదగిరిరెడ్డి, ఏఈఓలు శోభారాణి, సత్యం, సీనియర్ అసిస్టెంట్ జలేందర్‌రావులు ఆదివారం పంటలు, ఇళ్లను పరిశీలించారు. నష్టం వివరాలను తెలుసుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో సర్పంచ్‌లు పుప్పాల శేఖర్, లునావత్ స్వాతిరవీందర్‌నాయక్, జాల నర్సయ్య, ఉగ్గం ఉపేంద్రలింగరాజు, రైతుబంధు సమితి కోఆర్డినేటర్ మామిడి సత్యనారాయణ, ఉపసర్పంచ్ సుజాతసంజీవనాయక్, పాలసంఘం చైర్మన్ చల్లా వేణుధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

నాగారం : ఈదురు గాలులతో కూడిన అకాల వర్షానికి పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు అన్నెపర్తి జ్ఞానసుందర్ అన్నారు. ఆదివారం పస్తాల, పేరబోయినగూడెం గ్రామాల్లో దెబ్బతిన్న వరి పంటలను, ఐకేపీల్లో తడిసిన ధాన్యాన్ని పరిశీలించి మాట్లాడారు. అలాగే పేరబోయినగూడెంలో ఈదురు గాలులకు ఇల్లు ధ్వంసమైన పేరబోయిన పెద్ద ఉప్పలయ్యను పరామర్శించారు. ఆయనతో పాటు కాంగ్రెస్‌పార్టీ నాయకులు కొండ రాజు, కుమార్‌యాదవ్, కండే అంజయ్య, బుక్క శ్రీను, దేవరపు రమేష్, చందు, రామయ్య, రైతులు తదితరులు ఉన్నారు.

ఫసల్ బీమా యోజన అమలు చేయాలి

అర్వపల్లి : కేంద్ర ప్రభుత్వ పథకమైన ఫసల్ బీమా యోజనను రాష్ట్రంలో అమలు చేసి రైతులను ఆదుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ కడియం రామచంద్రయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వడగళ్ల వర్షంతో దెబ్బతిన్న పంటలను ఆదివారం ఆయన పరిశీలించారు. అలాగే కుంచమర్తి, రామన్నగూడెం తదితర గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50 వేల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని కోరారు. ఆయన వెంట మండల అధ్యక్షుడు పగిళ్ల శంకర్, కూర శంకర్, జిన్న అశ్విన్, వేముల సత్తయ్య, అంగోతు శ్రీనివాస్‌నాయక్ తదితరులు ఉన్నారు.


నాగారం : నర్సింహులగూడెంలో దెబ్బతిన్న వరి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు


అర్వపల్లి : కుంచమర్తిలోని కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న రామచంద్రయ్య


అర్వపల్లి : కుంచమర్తిలో పంట నష్టాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ రేణుక, అధికారులు


నాగారం : పస్తాలలో తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న అన్నెపర్తి జ్ఞానసుందర్

సూర్యక్షేత్రంలో వైభవంగా మహాసౌరహోమం


సూర్యక్షేత్రంలో పూజలు చేస్తున్న భక్తులు

అర్వపల్లి : తిమ్మాపురంలోని అఖండజ్యోతి స్వరూప సూర్యనారాయణస్వామి క్షేత్రంలో ఆదివారం మహాసౌరహోమాన్ని కనుల పండువగా నిర్వహించారు. తెల్లవారుజామున ఉషాపద్మిని ఛాయసమేత సూర్యనారాయణస్వామిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు జరిపారు. ఆ తర్వాత యజ్ఞశాలలో మహాసౌరహోమం నిర్వహించారు. అలాగే క్షేత్ర ఆవరణలోని కార్యసిద్ధి వీరహనుమాన్, శ్రీరామకోటి స్థూపాలను కూడా భక్తులు దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్నప్రసాద సత్రంలో భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో క్షేత్ర వ్యవస్థాపకుడు కాకులారపు జనార్దన్‌రెడ్డి, గణపురం నరేష్, అర్చకులు మిర్యాల రామశర్మ, వేణుగోపాలశర్మ, శ్రీనివాసశర్మ, భక్తులు పాల్గొన్నారు.

24, 25 తేదీల్లో రాష్ట్ర జనరల్ కౌన్సిల్ సమావేశాలు

నాగారం : సూర్యాపేటలోని శ్రీ లక్ష్మీ గార్డెన్స్‌లో సోమవారం జరిగే అఖిల భారత రైతుకూలీ సంఘం రాష్ట్ర జనరల్ కౌన్సిల్ సమావేశాలను జయప్రదం చేయాలని ఏఐకేఎంఎస్ డివిజన్ అధ్యక్షుడు సంపెట కాశయ్య కోరారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. సూర్యాపేటలో ఈ నెల 24, 25 తేదీల్లో జరిగే రాష్ట్ర జనరల్ కౌన్సిల్ సమావేశాలకు ఏఐకేఎంఎస్ జాతీయ అధ్యక్షుడు వేములపల్లి వెంకట్రామయ్య, ఉపాధ్యక్షుడు జే.వీ చలపతిరావులు హాజరవుతారని తెలిపారు. ఈ సమావేశాలకు ప్రజలు, రైతులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఆయనతో పాటు ఏఐకేఎంఎస్ నాయకులు బయ్యం లింగయ్య, ధందోలు ధనుంజయ్, యానాల సుధాకర్‌రెడ్డి, కృష్ణమూర్తి, గణేష్, కాసం వీరయ్య, ఉప్పలయ్య తదితరులు ఉన్నారు.

బీఆర్‌ఎస్ ప్లీనరీని విజయవంతం చేయాలి

తుంగతుర్తి : తుంగతుర్తి నియోజకవర్గ కేంద్రంలో ఈ నెల 25న జరిగే బీఆర్‌ఎస్ నియోజకవర్గ స్థాయి ప్లీనరీని విజయవంతం చేయాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య కోరారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన బీఆర్‌ఎస్ ముఖ్యకార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఈ నెల 25న గ్రామాల్లో పార్టీ జెండాలను ఎగరవేయాలని సూచించారు. ఈ ప్లీనరీ సమ్మేళనానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ హాజరవుతారని తెలిపారు. ఈ సమావేశంలో డీసీసీబీ డైరెక్టర్ గుడిపాటి సైదులు, వైస్ ఎంపీపీ మట్టపల్లి శ్రీశైలం, నల్లు రాంచంద్రారెడ్డి, గుండగాని రాములు, శ్రీను, రమేష్, జలేందర్ పాల్గొన్నారు.


తుంగతుర్తిలో మాట్లాడుతున్న సీతయ్య

25న బీఆర్‌ఎస్ ప్లీనరీ

నాగారం : తుంగతుర్తి మండల కేంద్రంలో ఈ నెల 25న జరిగే బీఆర్‌ఎస్ నియోజకవర్గ స్థాయి ప్లీనరీ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కల్లెట్లపల్లి ఉప్పలయ్య కోరారు. ఆదివారం మండల కేంద్రంలోని రహదారిబంగ్లాలో ఏర్పాటు చేసిన బీఆర్‌ఎస్ ముఖ్యకార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఈ నెల 25న గ్రామాల్లో పార్టీ జెండాలను ఎగరవేసి, అనంతరం ప్లీనరీ సమ్మేళనానికి తరలిరావాలన్నారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు గుండగాని అంబయ్యగౌడ్, యారాల రాంరెడ్డి, దోమల బాలమల్లు, కూరం వెంకన్న, అంజయ్య, చంద్రమౌళి, కన్నెబోయిన మల్లేష్, కుంభం కర్ణాకర్, వేముల రాంమూర్తి, తరాల ఆంజనేయులు, సుధాకర్‌రెడ్డి, యాదగిరి, చిప్పలపల్లి మల్లేష్, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిక

తిరుమలగిరి : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వివిధ పార్టీల నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ అన్నారు. తిరుమలగిరి మండలం వెలిశాల గ్రామ కాంగ్రెస్ పార్టీ ఎంపీటీసీ సభ్యులు పొన్నం సమతావెంకన్న ఆదివారం హైదరాబాద్‌లో ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సంకెపల్లి రఘునందన్‌రెడ్డి, ఎంపీపీ నెమురుగొమ్ముల స్నేహలత, సర్పంచ్ ఆకుల వీరయ్య, దూపటి రవీందర్, వేణుగోపాల్‌రెడ్డి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.


వెలిశాల ఎంపీటీసీ పొన్నం సమతావెంకన్నను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే కిశోర్

ప్రశాంతంగా గురుకుల పరీక్ష

తుంగతుర్తి : మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలల్లో ఆదివారం నిర్వహించిన 5వ తరగతి గురుకుల ప్రవేశపరీక్ష ప్రశాంతంగా ముగిసిందని ప్రిన్సిపల్స్ శ్యామలత, దుర్గాభవానిలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రవేశ పరీక్షకు 960 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 879 మంది హాజరైనట్లు తెలిపారు.

చెట్టుకూలి పాడి గేదె మృతి

అర్వపల్లి : అడివెంల గ్రామంలో శనివారం చెట్టు కూలి నోముల లింగయ్యకు చెందిన పాడి గేదెపై పడింది. దీంతో గేదె అక్కడికక్కడే మృతి చెందింది. అలాగే మరో రెండు పాడి గేదెలపై చెట్టుపడి గాయపడ్డాయి. మరణించిన పాడి గేదె రూ.70 వేల విలువ చేస్తుందని బాధిత రైతు లింగయ్య తెలిపారు. ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ముందస్తు జాగ్రత్త లేకపోవడంతోనే నష్టం

దురాజ్‌పల్లి : ప్రభుత్వ ముందస్తు జాగ్రత్త లోపంతోనే రైతులకు నష్టం జరిగిందని సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నష్టానికి ప్రభుత్వం బాధ్యత వహించాలని, పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

చెవిటి బతుకమ్మకు నివాళి

మద్దిరాల : కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చెవిటి వెంకన్న యాదవ్ మాతృమూర్తి చెవిటి బతుకమ్మ ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆదివారం గుమ్మడవెల్లిలో కాంగ్రెస్ నాయకులు ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో రాష్ట్ర నాయకుడు కొప్పుల వేణారెడ్డి, పీసీసీ అధికార ప్రతినిధి చకిలం రాజేశ్వర్‌రావు, జిల్లా మహిళా అధ్యక్షురాలు తిరుమలప్రగడ అనురాధ కిషన్‌రావు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడిపాటి నర్సయ్య, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కిక్కిరేణి కరుణాకర్‌రెడ్డి, మాణిక్యం, వెన్న మధూకర్‌రెడ్డి, అన్నమయ్య, రాము, కోడి కుమార్ యాదవ్, పశుల అశోక్ ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయాలు

నాగారం : నాగారం – తుంగతుర్తి ప్రధాన రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలైన సంఘటన పస్తాల శివారులో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం.. తుంగతుర్తి మండలం వెంపటి గ్రామానికి చెందిన కొండగడుపుల రమేష్ బైక్ పై తుంగతుర్తి నుంచి నాగారం మీదుగా తిరుమలగిరి వైపు వెళ్తున్నాడు. పస్తాల శివారులో ఈదురు గాలులకు రోడ్డుకు ఇరువైపుల విరిగిపడిన చెట్లు రాత్రి సమయం కావడంతో కనిపించలేదు. దీంతో రమేష్ చెట్టుకు ఢీకొని కిందపడడంతో తీవ్ర గాయాలైనాయి. గాయపడిన రమేష్ను చికిత్స నిమిత్తం 108 ద్వారా సూర్యాపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు.

చలివేంద్రం ప్రారంభం

ఆత్మకూరు (ఎస్) : మండల పరిధిలోని రామన్నగూడెం స్టేజీ వద్ద ప్రజల దాహార్తిని తీర్చేందుకుగాను మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ సంఘం నాయకుడు బత్తుల వెంకట్ రాములు ఆదివారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సల్వాది ఉపేందర్, మిరియాల చిన్ని, పాల్వాయి వెంకటేష్, కోట ఎలేందర్, మహేందర్, పానుగంటి ఎల్లెందర్, బత్తుల వంశీ, మహేష్, నితిన్, రవి తదితరులు పాల్గొన్నారు.

బసవేశ్వర స్వామి జయంతి వేడుకలు


సూర్యాపేట క్రైం : బసవేశ్వరస్వామి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎస్పీ


అర్వపల్లిలో బసవేశ్వర చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీపీ రేణుక, అధికారులు

సూర్యాపేటక్రైం : మహాత్మా బసవేశ్వర స్వామి జయంతి వేడుకలను జిల్లా పోలీసు కార్యాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బసవేశ్వర స్వామి చిత్రపటానికి ఎస్పీ రాజేంద్రప్రసాద్ పూలమాలవేసి నివాళులర్పించి మాట్లాడారు. సమాజంలో కుల వ్యవస్థను, వర్ణ భేదాలను, లింగ వివక్షను సమూలంగా వ్యతిరేకించిన అభ్యుదయ వాది బసవేశ్వర స్వామి అన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు నాగభూషణం, వెంకటేశ్వరరెడ్డి, డీసీఆర్‌బీ డీఎస్పీ రవి, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ నర్సింహ, పట్టణ సీఐ రాజశేఖర్, సీసీఐ సీఐ గౌరీ నాయుడు, ఆర్‌ఐలు శ్రీనివాస్, గోవిందరావు, ఎస్ఐ, ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.


తిరుమలగిరిలో..

అర్వపల్లి : మండల పరిషత్ కార్యాలయంలో బసవేశ్వర జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. బసవేశ్వరుడి చిత్రపటానికి ఎంపీపీ మన్నె రేణుకలక్ష్మీనర్సయ్యయాదవ్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ సీహెచ్. నర్సింహారాజు, సీఓలు సంతోష, నవీన్, శివకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

తిరుమలగిరి : బసవేశ్వర జయంతి వేడుకలను తిరుమలగిరిలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక తెలంగాణ చౌరస్తాలో ఆ సంఘం నాయకులు బసవేశ్వర చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రమణారెడ్డి జయంతి వేడుకల్లో పాల్గొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో కార్యాలయ సిబ్బంది శిల్పిక, రాజు, దాము పాల్గొన్నారు.

సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలి

ఆత్మకూరు (ఎస్) : రైతు వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ప్రజలంతా సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని అఖిల భారత రైతు కూలీ సంఘం డివిజన్ కార్యదర్శి అలుగుబెల్లి వెంకటరెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సంఘం ముఖ్యుల సమావేశంలో మాట్లాడారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఈ నెల 24, 25 తేదీల్లో రాష్ట్ర జనరల్ కౌన్సిల్ సభలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశాలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు డేగల వెంకటకృష్ణ, పోరెండ్ల దశరథ, జిల్లేరు, పిట్టల లింగయ్య, కళ్లంచర్ల చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ నూతన కమిటీ ఎన్నిక

భానుపురి : లయన్స్ క్లబ్ ఆఫ్ సూర్యాపేట నూతన కమిటీని పట్టణంలోని లయన్స్ సర్వీస్ సెంటర్‌లో ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దేవిరెడ్డి రవీందర్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా బోనగిరి విజయ్‌కుమార్, పెద్దిరెడ్డి కళ్యాణ్, ప్రధాన కార్యదర్శిగా రంగు దిలీప్ కుమార్, కోశాధికారిగా బేజాగం ఫణికుమార్, సహాయ కార్యదర్శిగా మీలా వంశీ, ప్రోగ్రాం కోఆర్డినేటర్‌గా పాశం అనంతరాములు, ప్రోగ్రాం కోఆర్డినేట్ చైర్మన్‌గా వాంకుడోత్ వెంకన్ననాయక్‌లను ఎన్నుకున్నారు. ఈ ఎన్నికలకు అధికారులుగా పెండెం చంద్రశేఖర్, చిలుముల శ్రీనివాస్‌రెడ్డి, యామా రమేష్‌లు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీఆర్‌ఎస్ నాయకులు గండూరి కృపాకర్, నూకల వెంకటరెడ్డి, డాక్టర్ రమేష్ చంద్ర, భావ్ సింగ్, వెంపటి శబరినాథ్, బజ్జూరి శ్రీనివాస్, మిట్టపల్లి రమేష్, దోగుపర్తి ప్రవీణ్ పాల్గొన్నారు.


నూతన కమిటీ సభ్యులు

సీఎం సహాయనిధి పేదలకు వరం

అర్వపల్లి : సీఎం సహాయనిధి పేదలకు వరం లాంటిదని బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు మొరిశెట్టి ఉపేందర్ అన్నారు. జాజిరెడ్డిగూడెం మండల కేంద్రానికి చెందిన తాడూరి రమ్యతేజ అనారోగ్యానికి గురికాగా వైద్య ఖర్చుల కోసం సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ. 36వేల చెక్కును ఆదివారం ఆమె కుటుంబీకులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కుంభం నాగరాజు, కొప్పుల సోమిరెడ్డి, పున్న హరిప్రసాద్, కోటమర్తి మల్లయ్య, పెద్ది శ్రీనివాస్, లొడంగి నాగరాజు, తాడూరి గిరి, ఎం. వెంకన్న, సందీప్, మహేష్, వార్డు సభ్యులు, బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


చెక్కు పంపిణీ చేస్తున్న మొరిశెట్టి ఉపేందర్

కంఠ మహేశ్వరస్వామి కల్యాణం

నాగారం : నాగారం మండల పరిధిలోని మామిడిపల్లి గ్రామంలో గౌడలు శ్రీ కంఠ మహేశ్వర స్వామి, సూరమాంబ దేవిల కల్యాణాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు కంఠ మహేశ్వర స్వామి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. బోనాలను, గంపలను అలంకార ప్రాయంగా తయారుచేసుకొని గ్రామంలోని వీధుల గుండా ర్యాలీగా వెళ్లి దేవతామూర్తులకు సమర్పించారు. ఈ కార్యక్రమంలో మొల్కపురి శ్రీకాంత్‌గౌడ్, ఓరిగంటి వెన్న, లింగయ్య, చిరంజీవి, రాంబాబు, చిలుకూరి మహేష్, ఖమ్మంపాటి సైదులు, ఉప్పలయ్య, వీరయ్య, సైదులు, రమేష్, రామకృష్ణ, అవిలయ్య, తదితరులు పాల్గొన్నారు.


మామిడిపల్లిలో గంపలు సమర్పించడానికి ఊరేగింపుగా వెళ్తున్న గౌడలు

విద్యార్థులకు మజ్జిగ పంపిణీ

చిలుకూరు : చిలుకూరు మండల పరిధిలోని మిట్స్, అక్షర పాలిటెక్నిక్ కళాశాలల ఆవరణలో గల గురుకుల పాఠశాలలో ఆదివారం జరిగిన గురుకుల ప్రవేశ పరీక్షకు హాజరైన విద్యార్థులకు బహుజన పార్టీ ఆధ్వర్యంలో తాగునీరు, మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కందుకూరి ఉపేందర్, బొల్లెపంగు రాజేందర్, ముదిగొండ నాగయ్య, బొల్లెపంగు వేణు, నందు, సురేష్, చంటి, నాగరాజు, సన్ని, విద్యార్థులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మరో ఇరవై ఏళ్లు అధికారంలో బీఆర్‌ఎస్

హుజూర్‌నగర్ : సీఎం కేసీఆర్ నేతృత్వంలో తెలంగాణలో బీఆర్‌ఎస్ పార్టీ మరో ఇరవై ఏళ్ల అధికారంలో ఉంటుందని రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్, హుజూర్‌నగర్ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీఆర్‌ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవంపై నిర్వహించిన బీఆర్‌ఎస్ ముఖ్య నాయకుల సమీక్ష సమావేశంలో వారు మాట్లాడారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ఎన్ని క్షుద్ర రాజకీయాలు చేసినా బీఆర్‌ఎస్ పార్టీని ఓడించలేరన్నారు. పేద ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా సీఎం కేసీఆర్ పని చేస్తున్నారని తెలిపారు. దేశవ్యాప్తంగా బీఆర్‌ఎస్ పార్టీ ప్రభంజనం సృష్టించడం ఖాయమని వారు ధీమా వ్యక్తం చేశారు. ఈ నెల 25న స్థానిక కౌండిన్య ఫంక్షన్ హాల్‌లో నిర్వహించే పార్టీ ప్లీనరీ సమావేశాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఓటుకు నోటు కేసులో దొరికిన వ్యక్తి నేడు కాంగ్రెస్ పార్టీ తెలంగాణ సారథిగా ఉండటం ఆ పార్టీకే సిగ్గుచేటని వారు విమర్శించారు. చేయి చేయి కలుపుదాం అంటూ కాంగ్రెస్ పార్టీ ఇచ్చే నినాదం కాంగ్రెస్ పార్టీ వారికే నచ్చడం లేదని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు అమర్‌నాథ్‌రెడ్డి, డి.పద్మ రాంరెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ అర్చన రవి, వైస్ చైర్మన్ జె.నాగేశ్వరరావు, జెడ్పీటీసీ కె.సైదిరెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు హరిబాబు, ముడెం గోపిరెడ్డి, బసవయ్య, వై.పిచ్చయ్య, కౌన్సిలర్లు, వార్డు అధ్యక్షులు, పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.